క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో శివలింగాల తిరువీధి



శివ లింగాలను ఊరేగిస్తున్న భక్తులు

భామిని: మండలంలోని బత్తిలి గ్రామంలో వెలసిన లలితా త్రిపుర సుందరీ దేవీ ఆలయ ప్రాంగణంలో అష్టోత్తర శత శివలింగ ప్రతిష్టాపన పూజలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం విగ్రహాల తిరువీధి నిర్వహించారు. శివనామ స్మరణతో గ్రామంలోని వీధులన్నీ మార్మోగిపోయాయి. ఊరేగింపులో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

- డీఎస్పీ జీవీ కృష్ణారావు



రావివలసలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

గరుగుబిల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలంతా సహకరించాలని పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు అన్నారు. మండలంలోని రావివలస, లఖనాపురం గ్రామాల్లో మంగళవారం కేంద్ర బలగాలు, పోలీసు సిబ్బందితో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా తమకు నచ్చిన అభ్యర్థిని ఎన్నుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని అన్నారు. గ్రామాల్లో అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించేవారిపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్సై అమ్మన్నరావు ఉన్నారు.

1న శివాలయం ప్రతిష్ఠ



నూతనంగా నిర్మించిన శివాలయం

గరుగుబిల్లి: మండలంలోని గిజబ పునరావాస గ్రామంలో ఏప్రిల్ 1 నుంచి కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. తోటపల్లి ప్రాజెక్టు ముంపు గ్రామమైన గిజబ పునరావాస గ్రామంలో గ్రామస్తుల సహకారంతో శివాలయాన్ని నిర్మించారు. ఏప్రిల్ 1 నుంచి ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు సర్పంచ్ మండల భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ మరడాన సింహాచలంనాయుడు, గ్రామస్తులు తెలిపారు. పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా రాధాకృష్ణుల డోలాయాత్ర



రాధాకృష్ణుల తిరువీధిలో పాల్గొన్న యువత

భామిని: మండలంలోని లివిరిలో వెలసిన గోపీనాథ రాధాకృష్ణుల డోలోత్సవంలో భాగంగా మంగళవారం హోలీ సంబరాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పర్లాఖిమిడి జమిందార్ కల్యాణి గజపతి ఉత్సవాలను ప్రారంభించారు. రాధాకృష్ణుల ఉత్సవ విగ్రహాలను గ్రామ వీధుల్లో ఊరేగించారు. వందలాది మంది యువత తిరువీధిలో పాల్గొని నృత్యాలు చేశారు. ఉత్సవ విగ్రహాలకు వంశధార నదిలో చక్రతీర్థ స్నానాలు చేశారు. నదీతీరంలో విగ్రహాలకు పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, ఆంధ్రా–ఒడిశా గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. బత్తిలి ఎస్సై చిట్టిపోలు ప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు



దివ్యాంగ చిన్నారులతో వ్యాయామ కృత్యాలు చేయిస్తున్న ఫిజియోథెరపిస్ట్

భామిని: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో మంగళవారం దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. ఎంఈఓ వి.భాస్కరరావు ఆధ్వర్యంలో ఫిజియోథెరపిస్ట్ బి.శ్రీకాంత్ పిల్లలతో వ్యాయామ కృత్యాలు చేయించారు. వాటిని ఇంటి వద్ద పిల్లలతో క్రమం తప్పకుండా చేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఐఈఆర్‌టీ సురేష్‌నాయుడు, సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధికి కేరాఫ్.. గొట్టమంగళాపురం

- సుమారు రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులు
- అర్హులకు సంక్షేమ పథకాల ద్వారా రూ.11.29 కోట్లు లబ్ధి
- ఐదేళ్లలో మారిన గ్రామం రూపురేఖలు



నాడు-నేడు నిధులతో అభివృద్ధి చేసిన ప్రభుత్వ పాఠశాల



రైతుభరోసా కేంద్రం



విలేజ్ హెల్త్ క్లినిక్

పాలకొండ రూరల్: గ్రామాల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ఐదేళ్లలో కోట్లాది రూపాయల నిధులు కేటాయించింది. ఆ నిధులతో రోడ్లు, కాలువలు, తాగునీరు, విద్యుత్, ప్రభుత్వ భవనాలు, పాఠశాలలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటు తదితర అభివృద్ధి పనులు చేపట్టారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న గొట్ట మంగళాపురం గ్రామాభివృద్ధిని గత ప్రభుత్వం గాలికొదిలేస్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధికి కేరాఫ్‌గా మార్చింది. సంక్షేమ ఫలాలు అర్హుల గడప వద్దకే చేరుతున్నాయి. దీంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పనితీరుపై గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

గ్రామంలో చేపట్టిన అభివృద్ధి..

- రూ.25 లక్షలతో గ్రామ సచివాలయ భవనం నిర్మాణం.
- రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం నిర్మాణం.
- నాడు–నేడు నిధులు రూ.36 లక్షలతో ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ భవనాల ఆధునికీకరణ.
- 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిధులు రూ.20 లక్షలతో సీసీరోడ్లు, కాలువల నిర్మాణం.
- రూ.18 లక్షలతో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు.
- రూ.17లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను నిర్మాణం.
- రూ.8 లక్షలతో 40 వేల లీటర్ల సామర్థ్యంతో రక్షిత మంచినీటి పథకం పునరుద్ధరణ.

ప్రత్యక్ష, పరోక్ష లబ్ధి..

నవరత్నాల పేరిట సచివాలయ పరిధిలో అర్హత కలిగిన ప్రతీ కుటుంబానికి సంక్షేమ ఫలాలను అందించటం జరిగింది. ప్రత్యక్ష నగదు బదిలీ(డీబీటీ) విధానంలో రూ.9,02,10,149లు లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమచేటం జరిగింది. పరోక్ష లబ్ధి(నాన్ డీబీటీ) విధానంలో సచివాలయ పరిధిలో 89 మందికి విద్యాకానుక, 27 మందికి జగనన్నతోడు, 86 మంది విద్యార్థులకు గోరుముద్ద, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా 148 మందికి, వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా 81 మందికి, 466 మందికి రేషన్ అందించే క్రమంలో చేసిన ఖర్చు రూ.2,26,91,339. మొత్తంగా సచివాలయం ద్వారా డీబీటీ, నాన్ డీబీటీ విధానంలో రూ.11,29,01,488లు వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యాకలాపాల నిర్వహణకు ప్రభుత్వం ఖర్చుచేసింది.

గడప వద్దకే సంక్షేమ పథకాలు



ప్రభుత్వం అందించిన పథకాలతో మేమంతా ఆర్థికంగా నిలదొక్కుకున్నాం. మా అబ్బాయికి, అత్తమ్మకు పింఛన్లు వర్తిస్తున్నాయి. అమ్మ ఒడి, ఆసరా వంటి పథకాలు మా ఇంట్లో సభ్యులకు వచ్చాయి. ప్రభుత్వ తోడ్పాటుతో పిల్లలు బడి బాట పట్టారు. గతంలో సంక్షేమ పథకాలు కావాలంటే కాళ్లు అరిగేలా తిరిగేవాళ్లం. ఇప్పుడు ఆ కష్టం లేదు. అర్హత ఉంటే చాలు, ఇంటి వద్దకే వచ్చి అందిస్తున్నారు. సీసీరోడ్లు, కాలువలు, ప్రభుత్వ భవనాలు నిర్మించారు. చూస్తుండగానే మా ఊరు ఎంతో మారిపోయింది.

– లంక ధనలక్ష్మి, గొట్ట మంగళాపురం గ్రామం, పాలకొండ మండలం

పథకం	లబ్ధిదారులు	చెల్లించిన మొత్తం
జగనన్న అమ్మ ఒడి	138	రూ.64,04,755
జగనన్న విద్యాదీవెన	159	రూ.41,15,485
జగనన్న వసతి దీవెన	114	రూ.18,82,830
వైఎస్సార్ రైతుభరోసా	299	రూ.1,46,85,800
వైఎస్సార్ సున్నావడ్డీ (పంట రుణాలు)	120	రూ.3,69,403
వైఎస్సార్ పంట బీమా	3	రూ.16,013
వైఎస్సార్ పింఛన్ కానుక	382	రూ.3,61,43,250
వైఎస్సార్ చేయూత	183	రూ.86,62,217
వైఎస్సార్ ఆసరా	415	రూ.1,11,30,802
వైఎస్సార్ సున్నావడ్డీ (ఎస్‌హెచ్‌జీలకు)	492	రూ.8,65,217
వైఎస్సార్ కాపు నేస్తం	2	రూ.30,000
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	88	రూ.25,23,917
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	64	రూ.3,62,575
హౌసింగ్ (లబ్ధిదారులకు నేరుగా చెల్లింపులు)	12	రూ.10,16,403
వైఎస్సార్ బీమా	4	రూ.5,60,000
వైఎస్సార్ వాహనమిత్ర	7	రూ.2,10,000
జగనన్న చేదోడు	3	రూ.70,000
కోవిడ్ సాయం(తెల్ల రేషన్ కార్డుదారులకు)	524	రూ.5,24,000
జగనన్న తోడు(వడ్డీ)	8	రూ.1,05,776
వైఎస్సార్ మత్స్యకార భరోసా	1	రూ.10,000



గ్రామ సచివాలయ భవనం

కళావతికి హ్యాట్రిక్ విజయాన్ని అందిస్తాం



ఎమ్మెల్యే కళావతిని దుశ్శాలువతో సత్కరిస్తున్న వీరఘట్టం వైఎస్సార్‌సీపీ నాయకులు

వీరఘట్టం: మంచికి మారుపేరుగా నిలిచిన పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతికి హ్యాట్రిక్ విజయాన్ని అందిస్తామని వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి కళింగ ప్రేమభూషణరావు అన్నారు. వండవ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను మంగళవారం కలిసి దుశ్శాలువతో సత్కరించారు. కళావతిని గెలిపించి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు భోగి మణి, జె.అమర్‌నాథ్, శంభాన శ్రీను, బూరాడ చిన్న, కెంగువ ఆంజనేయులు, అంబళ్ల రవి, దొలూరు శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాలి



పాలకొండ రూరల్: బుక్కూరులో సచివాలయ సిబ్బందితో కలిసి పర్యటిస్తున్న నోడల్ అధికారి



వీరఘట్టం: చిట్టపులివలస పోలింగ్ కేంద్రం పరిసరాలను పరిశీలిస్తున్న నోడల్ అధికారి

పాలకొండ రూరల్: గ్రామస్థాయిలో ఎన్నికల ప్రవర్తన నియమావళి కచ్చితంగా అమలు చేయలి ఎన్నికల నోడల్ అధికారి ఎస్.రామకృష్ణ ఆదేశించారు. మండలంలో టీకే.రాజపురం, బెజ్జి, బుక్కూరు, తదితర గ్రామాల్లో ఎన్నికల కోడ్ అమలు తీరును మంగళవారం ఆయన పర్యవేక్షించారు. గ్రామాల్లో ఓటర్లను ప్రభావితం చేసేలా రాజకీయ నాయకుల, ప్రజా ప్రతినిధుల బొమ్మలు, పేర్లతో కూడిన స్లోగన్లు, బ్యానర్లు, గోడలపై రాతలు లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వ అధికారులు ఎన్నికల నిబంధనలకు లోబడి విధులు నిర్వహించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎవరైనా చట్టపరమైన, శాఖా పరమైన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు.

పాలకొండ: ఎన్నికల ప్రవర్తన నియమావళిని పక్కాగా అమలు చేయాలని నగరపంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు అన్నారు. పట్టణంలోని పలు సచివాలయాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఎన్నికల కోడ్ అమలుపై సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. రాజకీయ పార్టీల ప్రచారాలు, సమావేశాలపై ప్రత్యేక దృష్టిసారించాలని, అనుమతులు లేకండా ప్రచారం, సభలు నిర్వహిస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. రాజకీయ పార్టీ నాయకులతో ఎటువంటి చర్చలు చేయకూడదని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

వీరఘట్టం: మండలంలోని చిట్టపులివలస, నడుకూరు, కంబరవలస పోలింగ్ కేంద్రాలను ఎన్నికల కోడ్ నోడల్ అధికారి ఎం.వి.బి.సుబ్రహ్మణ్యం మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఉండేలా చూడాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. ఓటర్లు ప్రశాంతంగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ఆశీర్వదించు స్వామీ..



గోపీనాథ రాధాకృష్ణ సన్నిధిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

భామిని: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేటి నుంచి చేపట్టే 'మేము సిద్ధం' బస్సు యాత్ర విజయవంతం అయ్యేలా చూడాలని, వైఎస్సార్‌సీపీ మరోసారి అధికారంలోకి వచ్చేలా ఆశీర్వదించాలని ప్రార్థిస్తూ లివిరి గోపీనాథ రాధాకృష్ణ ఆలయంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ శాశ్వత ధర్మకర్త, పర్లాఖిమిడి జమిందారు కల్యాణి గజపతికి ఎమ్మెల్యే పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఆలయ అభివృద్ధిపై చర్చించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కళావతిని సన్మానించారు. అంతకుముందు ఆమె వంశధార నదీ తీరంలో వెలసిన మల్లికార్జున స్వామి సన్నిధిలో అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ టి.కామేశ్వరి, ఏఎంసీ చైర్మన్ హిమరక మోహనరావు, సొసైటీ చైర్మన్ గెల్లంకి రమేష్, డైరెక్టర్ కాగితాపల్లి కృష్ణారావు, సర్పంచ్ బౌరి సోదామిని, పార్టీ నాయకులు కైలాష్ గౌడ్, బౌరి త్రినాథ్, ఎరుకుమజ్జి పాపినాయుడు, చెప్పల రాములు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత ఉపకరణాలకు ఎంపిక



మాట్లాడుతున్న ఎంఈఓ-2 రాధాకృష్ణ

కురుపాం: ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఉచిత ఉపకరణాలు అందించేందుకు గాను స్థానిక భవిత కేంద్రంలో మంగళవారం ఎంపిక శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాల నుంచి సుమారు 75 మంది పిల్లలు హాజరయ్యారు. వైద్యాధికారి ఆశ, ఫిజియోథెరపిస్ట్ ప్రశాంత్ వారికి తనిఖీలు నిర్వహించారు. 55 మందికి ఉపకరణాలు అవసరమని నిర్ధారించారు. శిబిరాన్ని ఎంఈఓ–2 రధాకృష్ణ పరిశీలించారు. కార్యక్రమంలో ఐఈ కోఆర్డినేటర్ పి.భానుమూర్తి, ఐఈఆర్పీ ఎం.గౌరీశ్వరి, ఎస్.శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అనుమతులు తప్పనిసరి

కురుపాం: పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి రాజకీయ పార్టీలు నిర్వహించే ప్రచార కార్యక్రమాలకు, వాహనాలకు, మైక్ సెట్, ర్యాలీలు, సమావేశాలకు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.వి.రమణ సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలను మంగళవారం ఆయన ప్రకటించారు. సువిధ ఆన్‌లైన్ యాప్ ద్వారా పూర్తి సమాచారంతో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. తాత్కలిక పార్టీ కార్యాలయాల ఏర్పాటు, మైక్ సెట్, వీడియో వ్యాన్, ర్యాలీ నిర్వహించే మార్గం, ఎంతమంది హాజరవుతారు, క్యాంపెయిన్ నిర్వహణకు అవసరమైన అనుమతి, కరపత్రాలు ముద్రణ, పంపిణీ, వాహనాలకు మైక్‌సెట ఏర్పాటుకు ముందుగా అనుమతి తీసుకోవాలని కోరారు.

నేటి నుంచి ఎమ్మెల్యే కళావతి ఎన్నికల ప్రచారం

వీరఘట్టం: పాలకొండ నియోజకవర్గంలో బుధవా రం నుంచి ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. తొలి విడతలో ఈనెల 27న సీతంపేట మండలం కిండంగి పంచాయతీ నుంచి ప్రచారం ప్రారంభిస్తారు. 28న చిన్నబగ్గ పంచాయతీలో, 29న వీరఘట్టం మండలం దశుమంతపురం, పరిసర గ్రామా ల్లో ప్రచారం నిర్వహిస్తారు. 30న వీరఘట్టం మండలం నడిమికెల్ల పంచాయతీలో, 31న పాలకొండ మండలం అంపిలిలో, ఏప్రిల్ 1న అన్నవరం పంచాయతీతో పాటు సమీపం పంచాయతీల్లో, ఏప్రిల్ 2న భామిని మండలం సొలికిరి నుంచి, ఏప్రిల్ 3న బత్తిలి నుంచి ప్రచారం చేస్తారని వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నెట్‌వర్క్‌పై ఆరా



దాసుగుమ్మడలో పోలింగ్ కేంద్రం వద్ద సూచనలిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: పాలకొండ నియోజకవర్గంలో సెల్ సిగ్నల్స్ సరిగా అందని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటింగ్ సమాచారం కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్టు రిటర్నింగ్ ఆఫీసర్ కల్పనా కుమారి తెలిపారు. దాసుగుమ్మడ, పెద్దతంకిడి, గుజ్జి, పెద్ద పల్లంకివలస, చిన్నపల్లంకి, బర్న పోలింగ్ కేంద్రాల్లో నెట్‌వర్క్ స్థితిగతులు తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో మరుగు దొడ్లు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. ఆమె వెంట తహసీల్దార్ మహేశ్వరరావు, ఆర్ఐ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

- ఆర్డీఓ వి.వి.రమణ



ఎన్నికల పీఓలు, ఏపీఓలకు సూచనలిస్తున్న ఆర్డీఓ వి.వి.రమణ

గుమ్మలక్ష్మీపురం: సార్వత్రిక ఎన్నికల విధులను పీఓలు, ఏపీఓలు అప్రమత్తంగా నిర్వహించాలని పాలకొండ ఆర్డీఓ వి.వి.రమణ సూచించారు. గుమ్మలక్ష్మీపురం ఏకలవ్య ఆదర్శ మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో తహసీల్దార్ రామారావు పర్యవేక్షణలో ఎన్నికల పీఓలు, ఏపీఓలకు ఎన్నికల విధులపై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈవీఎంల వినియోగం, నిర్వహణ, వీవీ ప్యాడ్స్, మార్క్‌డ్ కాపీ వాడకం, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. పోలింగ్ రోజున ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సజావుగా విధులు నిర్వహించేందుకు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు బి.చంద్రశేఖర్, బి.జనార్దన్‌నాయుడు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యం

సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతగా నిర్వహించడమే తమ ముందున్న లక్ష్యమని ఆర్డీఓ వి.వి.రమణ అన్నారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కురుపాం నియోజకవర్గంలో 268 పోలింగ్ కేంద్రాలకు గాను 39 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించామన్నారు. ఆయా కేంద్రాల పరిధిలో ఎన్నికలు సజవుగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో 683 మంది పీఓలు, ఏపీఓలను నియమించడం జరిగిందని, ఎన్నికల విధులపై వారికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని అన్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 1,788 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే వేటు తప్పదు



మాట్లాడుతున్న ఏఆర్ఓ శ్రీనివాసరావు, డీటీ మధుసూదనరావు

భామిని: నిత్యావసర సరుకులు అందించే డీలర్లు, సేల్స్‌మేన్లు, ఎండీయూ ఆపరేటర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనరాదని ఏఆర్ఓ, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీఎస్ డీటీ కె.మధుసూదనరావు ఆధ్వర్యంలో డీలర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని వివరించారు. నిబంధనలు అతిక్రమిస్తే వేటు తప్పదని హెచ్చరించారు. ఏప్రిల్–1 నుంచి ఇంటింట రేషన్ అందివ్వాలన్నారు. రేషన్ బండిపై ఎటువంటి నాయకుల ఫొటోలు లేకుండా చూడాలన్నారు. వలంటీర్ల సాయం తీసుకోరాదని స్పష్టం చేశారు. అవసరమైతే వీఆర్వోల సాయం తీసుకోవాలని సూచించారు. ఆర్ఐ ఎస్.రాంబాబు ఉన్నారు.

సమయపాలన తప్పనిసరి



ప్రిజమ్-10 కార్యక్రమ నిర్వహణపై ఆరా తీస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

పాలకొండ రూరల్: సచివాలయ సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటించాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. మండలంలోని బెజ్జి గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్పందన వినతులు, వాటి పరిష్కారంపై సిబ్బందిని ఆరాతీశారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, ప్రజారోగ్య రక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలన్నారు. అనంతరం ప్రిజమ్–10 కార్యక్రమంలో భాగంగా బుక్కూరు గ్రామంలో కె.ప్రశాంతి అనే గర్భిణి ఇంటికి వెళ్లి ఆమె ఆరోగ్య పరిస్థితిని వాకబు చేశారు. ఎస్విత అనే చిన్నారితో పాటు మరి కొంతమంది పిల్లల పెరుగుదలకు ప్రిజమ్ పరిధిలో సిబ్బంది తీసుకుంటున్న చర్యలపై చిన్నారుల తల్లితండ్రులను అడిగి తెలుసుకున్నారు. అభిలాష కార్యక్రమంలో భాగంగా డిజిటల్ లైబ్రరీలు, సచివాలయాల ద్వారా కాంపిటేటివ్ పరీక్షల కోసం అందించిన పుస్తకాల వినియోగంపై స్థానిక యువతతో చర్చించారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ కె.సూర్యనారాయణ ఉన్నారు.

నాడు గుంతల మయం.. నేడు గుంతలు మాయం





చెరువును తలపిస్తున్న పాలకొండ-రాజాం రహదారి (ఇన్‌సెట్లో) రూ.3.75 కోట్లతో నూతనంగా నిర్మించిన పాలకొండ-రాజాం రహదారి

గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పాలకొండ-రాజాం రహదారి పూర్తిగా ఛిద్రమైంది. గుంతలతో నిండిన ఈ రోడ్డులో ప్రయాణం నరకాన్ని తలపించేది. వర్షాకాలంలో ఆ గుంతల్లో నీరు చేరడంతో తరచూ ప్రమాదాలు సంభవించేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రహదారి దుస్థితిని స్థానిక ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. నిత్యం వేలాది మంది ఇదే రహదారిలో రాజాం, చీపురుపల్లి, విజయనగరం, విశాఖ ప్రాంతాలకు వెళ్తుంటారని, రోడ్డు నిర్మాణంకు నిధులు కేటాయించాలని సీఎంను కోరారు. ఆయన వెంటనే స్పందించి రూ.3.75 కోట్లు మంజూరు చేశారు. ఆ నిధులతో పాలకొండ వయా అన్నవరం కూడలి, గోపాలపురం, మంగళాపురం వరకు సుమారు 5 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణం చేపట్టారు. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేసి రహదారిని అందుబాటులోకి తీసుకొచ్చారు.

–పాలకొండ రూరల్